క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో ఈ సోమవారం ఆసరా సంబరాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఖాజీపాలెం గ్రామ సచివాలయం వద్ద సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి పాల్గొంటారని చెప్పారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్డీవో కార్యాలయంలో నేడు స్పందన

రేపల్లె రూరల్: పట్టణంలోని రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో హేలా షారోన్ ఆదివారం తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

బాపట్ల ఫొటోగ్రాఫర్‌కు డాక్టరేట్



బాపట్ల: బాపట్ల మండలం ముత్తాయిపాలెం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ పీవీఎస్ నాగరాజుకు గౌరవ డాక్టరేట్ లభించింది. నాగరాజు ఫొటోగ్రఫీలో చేసిన సేవలను గుర్తిస్తూ ఆసియా ఇంటర్నేషనల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించారు. ఇటీవల హైదరాబాద్ స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టరేట్‌ను పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ జాయింట్ సెక్రటరీ కె.యాదయ్యగౌడ చేతుల మీదుగా అందించారు. ఈ మేరకు ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ డైరెక్టర్ రమేష్ తో పాటు పలువురు అభినందించారు.

గడువులోగా ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించండి

బాపట్ల అర్బన్: ఈ ఏడాది మార్చి నెలలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు ఇప్పటి వరకు పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తత్కాల్ స్కీమ్ కింద రూ.3 వేలు అపరాధ రుసుము చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పి.ఎరయ్య తెలిపారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. ఇంటర్ చదివే జనరల్, ఒకేషనల్ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇంటర్మీడియట్ తొలి సంవత్సరం అడ్మిషన్ల సమయంలో విద్యార్థి వ్యక్తిగత వివరాలు తప్పుగా నమోదు అయినట్లయితే ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సవరణకు అవకాశం ఉందని తెలిపారు.

నేడు వేంకటేశ్వర కల్యాణం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గుత్తావారిపాలెంలో సోమవారం వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

నేడు పంచాయతీ దుకాణాలకు అద్దె వేలం

కొల్లూరు : పంచాయతీ ఆధీనంలో ఉన్న దుకాణాలకు సోమవారం అద్దె వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓ బి.మల్లిఖార్జున ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొల్లూరు బస్టాండ్ సెంటర్లో ఉన్న ఏడు దుకాణాలకు గతంలో నిర్వహించిన అద్దె వేలం గడువు ముగియడంతో అధికారుల అనుమతితో తిరిగి అద్దె వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొల్లూరు పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వేలంలో ఆసక్తి గల వ్యక్తులు రూ. 50 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చునని తెలిపారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

తాడేపల్లి రూరల్ : ముస్లింలకు రాజకీయంగా, సామాజికంగా అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమని తెలిపారు. దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు గుంటూరు ఈస్ట్, విజయవాడ పశ్చిమం, నెల్లూరు సిటీ, కర్నూలు, కదిరి, కడప, మదనపల్లి కలిపి మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలు కేటాయించారని తెలిపారు. ఇది సామాజిక న్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు. మైనార్టీల అభ్యున్నతి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జాన్ సైదా పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టండి

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి ఎంపీ మోపిదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో ముందుగా గత సమావేశం నుంచి ఈ సమావేశం వరకు గ్రామాల్లో జరిగిన అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ వేసవి కాలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా ఎక్కువ మందికి జాబ్ కార్డులు ఏర్పాటు చేసి వారికి పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి నాయకులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ ప్రజలతోనే ఎక్కువగా మమేకం అవ్వాలన్నారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పైనం రంగారెడ్డి, కొత్తపల్లి సుమలత, కోఆప్షన్ సభ్యుడు ఫారూక్, డీఎల్‌పీవో తాతా శివశంకరరావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి ఎంఈవో నవీన్‌కుమార్, మండలంలోని సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత

రేపల్లె రూరల్: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. రేపల్లె మండలం లంకెవానిదిబ్బ గ్రామానికి చెందిన వలంటీరు కొక్కిలిగడ్డ యాకోబు విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. తన చేతి శస్త్ర చికిత్సకు అవసరమైన రూ.2.50 లక్షల చెక్కును మోపిదేవి అందజేశారు. చెరుకుపల్లి మండలం ఆరుంబాక పంచాయతీ యేమినేనివారిపాలెం గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు కాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ.2.50 లక్షల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజుకాల్వ సర్పంచ్ తలశిల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనే ప్రభుత్వానికి శ్రీరామరక్ష

ఎమ్మెల్యే కోన రఘుపతి



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రఘుపతి

బాపట్ల: సంక్షేమం, అభివృద్ధే మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి అధికారం తెచ్చిపెడుతుందని బాపట్ల పేర్కొన్నారు. మండలంలోని పిన్నిబోయినవారిపాలెంలో పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనలేక కూటములు కట్టుకుని వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పిన్నిబోయిన ఎస్తేరురాణి, నాయకులు గవిని కృష్ణమూర్తి, పిన్నిబోయిన ప్రసాద్, నరేస్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల అపహరణకు యత్నం

- నిందితులను పట్టుకున్న స్థానికులు
- పోలీసులకు అప్పగింత

కొల్లూరు : పశువుల పాకలో కట్టేసి ఉంచిన పశువులను అపహరించేందుకు చోరులు చేసిన యత్నం విఫలమై స్థానికుల చేతికి నిందితులు దొరికిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండలంలోని తాడిగిరిపాడుకు చెందిన గుడిమెట్ల సాయ్యేలు శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తన గృహం ఎదురుగా ఉన్న పశువుల పాకలో పశులను కట్టేసి ఇంటిలో కుటుంబ సభ్యులతో కలసి నిద్రకు ఉపక్రమించాడు. అర్ధరాత్రి సమయంలో పశువుల చావిడి నుంచి శబ్దాలు రావడంతో పాటు, పశువులు అరుస్తుండడంతో నిద్రలేచిన సాయ్యేలు, అతని భార్య చావిడి వద్దకు వెళ్లి పరిశీలించగా, ముగ్గురు వ్యక్తులు పశువుల తాళ్లు ఊడదీస్తుండటం గమనించారు. పశువులను దొంగిలించేందుకు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చినట్లు పసిగట్టి కేకలు వేస్తూ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. పశువుల యజమానుల రాకను గమనించిన నిందితులు పరారయ్యేందుకు ప్రయత్నించగా, అప్పటికే అప్రమత్తమైన స్థానికులు వారిని వెంబడించి వారిలో ఇరువురు వ్యక్తులను పట్టుకోగా, ఓవ్యక్తి పరారయ్యాడు, దొరికిన నిందితులకు దేహశుద్ధి చేసి కొల్లూరు పోలీసులకు అప్పగించారు. దొంగతనానికి వచ్చిన వ్యక్తులు వేమూరుకు చెందిన చావలి విజయ్, పెరవలి కిశోర్, నల్లమోతు చిన్నబ్బాయిగా గుర్తించిన పశువుల యజమాని కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆ నాటి స్నేహం మధురాతి మధురం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెదవడ్లపూడి(మంగళగిరి): నగర పరిధిలోని పెదవడ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. 1974–1975లో పదో తరగతి చదివిన వారంతా పెదవడ్లపూడిలోని మామిడి తోటలో కలుసుకున్నారు. చిరునవ్వులు, ఆలింగనాలు, ఆప్యాయత పలకరింపులతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ప్రస్తుత హోదాలను మరచి చిన్నపిల్లలుగా మారి స్కూలు రోజులను గుర్తు చేసుకున్నారు. చిన్నతనంలో చేసిన చిలిపి జ్ఞాపకాలతో రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అనంతరం చక్కటి విందును ఆరగించారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజ స్వామి నగరోత్సవం



పాత గుంటూరు: లక్ష్మీపురం త్యాగరాజస్వామి కళావేదికగా గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో ఆదివారం సంగీత గురువు త్యాగబ్రహ్మ 177వ ఆరాధన సంగీత మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ బి. జయామూర్తి జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ హరి కథకులు శంభయాచారి త్యాగరాజస్వామి వేష ధారణలో ఆయన కీర్తనల ఆలాపనతో నగరోత్సవం నిర్వహించారు.అనంతరం పంచరత్న కీర్తనల గానం జరిగింది. శాస్త్రీయ సంగీత కచేరిలో చెన్నైకు చెందిన సాయి విఘ్నేష్ పలు త్యాగరాజస్వామి కృతుల్ని శ్రావ్యంగా గానంచేసి సంగీతాభిమానుల్ని అలరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎం.డి.వి. రమణారావు మాట్లాడుతూ అయోధ్యలో రాముడి ప్రతిష్ఠ జరిగిన ఈ సంవత్సరం త్యాగరాజ ఉత్సవాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయని తెలిపారు. డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, రామరాజు ఫౌండేషన్ ఛైర్మన్ రామరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలతో నగరోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాకారుల్ని అభినందించారు. కార్యక్రమాన్ని కార్యదర్శి ఏ.వి.మంగాదేవి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, ఉప కార్యదర్శి ఎం. మాధవీకృష్ణ, కోశాధికారి ఎం.విజయలక్ష్మి పర్యవేక్షించారు. ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి నిర్వహించారు.

ముగిసిన ఇంటర్ స్టేట్ ఛాంపియన్ షిప్ పోటీలు

ఓవరాల్ ఛాంపియన్ షిప్ బాపట్ల కైవసం

బాపట్ల అర్బన్: బాపట్ల టీటీడీ కల్యాణ మండపంలో ఇంటర్ స్టేట్ ఇన్విటేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలను ఆదివారం నిర్వహించారు. వైఎస్ఆర్ మాస్టర్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 20 జిల్లాలకు చెందిన 300 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ కరాటే టీం చీఫ్ కోచ్ కీర్తన్ కొండ్రు, ప్రెసిడెంట్ (ఎస్‌కెటిఎపీపీ) కేఎంఎల్ శాస్త్రి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వైఎస్ఆర్ మాస్టర్ ఆర్ట్స్ అకాడమి బాపట్ల ఓవరాల్ ఛాంపియన్ షిప్ గెలుపొందగా, రెండో స్థానం ప్రకాశం జిల్లా కైవసం చేసుకుంది. ఇందులో భాగంగా 40 బంగారు పతకాలు, 20 రజత పతకాలు, 8 కాంస్య పతకాలు వైఎస్ఆర్ మాస్టర్ ఆర్ట్స్ అకాడమీ బాపట్ల విద్యార్థులు సాధించారు. ఈ కార్యక్రమంలో ఛాంపియన్ షిప్ టెక్నికల్ డైరెక్టర్‌గా ఎస్.మోహన్ రావు, చీఫ్ రిఫరీగా ఎస్.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. విశిష్ట అతిథులుగా మన్నే శ్రీనివాసరావు, కె.మల్లికార్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడుగా జాఘవా

వేమూరు: బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడుగా చుండూరు జాఘవాను నియమించినట్లు జిల్లా పార్టీ అధ్యక్షులు ఘంటా అంజి బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు నియోజక వర్గంలోని జంపని గ్రామానికి చెందిన చుండూరు జాఘవాను కాంగ్రెస్ పార్టీ అతిష్టానం ఆదేశాల మేరకు జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు చెప్పారు. జాఘవా నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు జేడీ శీలం, సుబ్బారావు, తాడి కొండ వెంకటేశ్వరరావు, అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

బంద్, సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో ప్రసంగిస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు

తాడేపల్లి రూరల్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న నిర్వహించనున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో రైతు, కౌలు రైతు, కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. శివశంకరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సీ టు ప్లస్ 50 శాతం మద్దతు ధరలను పార్లమెంటులో ఆమోదించేందుకు చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 లేబర్ కోడ్‌లను రద్దు చేసి, నాలుగుగా మార్చడం దుర్మార్గమని ఖండించారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సీఐటీయూ నాయకులు వడ్డేశ్వరం పున్నయ్య, మహిళా సంఘం తాడేపల్లి మండల అధ్యక్షురాలు కారసాల స్వాతి పాల్గొన్నారు.

6న సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం

వేమూరు: వేమూరులో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఈ నెల 6న ప్రారంభించడం జరుగుతుందని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి హరిణి ఆదివారం తెలిపారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, నియోజక వర్గం సమన్వకర్త వరికూటి అశోక్ బాబు పాల్గొంటారని ఆమె చెప్పారు. ప్రభుత్వం రూ.8 కోట్ల 36 లక్షలతో నూతనంగా 30 పడకల ఆరోగ్య కేంద్రం నిర్మాణం చేయడం జరిగిందని ఆమె తెలిపారు. వేమూరు నియోజక వర్గంలోని భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు, అమర్తలూరు, చుండూరు మండలాలకు చెందిన ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.

దేవాంగులకు సముచిత స్థానం కల్పించాలి

మంగళగిరి: రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు దేవాంగులకు జనాభా దామాషా ప్రకారం మూడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ సీట్లు కేటాయించాలని సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. దేవాంగులకు సముచిత స్థానం కల్పించిన రాజకీయ పార్టీలకే తాము మద్దతు ప్రకటిస్తామని తెలిపారు. చీరాల, పుట్టపర్తి, రాజమండ్రి రూరల్ సీట్లతో పాటు హిందూపురం పార్లమెంట్ సీటును కేటాయించాలని కోరుతూ ఆదివారం పట్టణంలో ఎన్ఆర్ఐ జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి పక్కనున్న కన్వెన్షన్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు డి.కె. నాగరాజు, బల్ల వెంకట రమణ, పుచ్చల రామకృష్ణ, సజ్జ హేమలత, బీరక ప్రసాద్, ఆకాశపు స్వామి, నక్కిన రాజశేఖర్, ఏరాసు అరుణబాబు పాల్గొన్నారు.

11న గాయకులకు స్వరరత్న పురస్కారాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న రంగారావు, గాయకులు

పాత గుంటూరు: అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 11న ఇన్నర్ రింగు రోడ్డులోని శిల్పారామం వేదికగా విశిష్ట గాయకులకు స్వరరత్న పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు కళాదర్బార్ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఘంటసాల గానామృతం పేరుతో సంగీత విభావరి ఉంటుందని తెలిపారు.అనంతరం జరిగే సభలో అతిథులుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఘంటసాల కృష్ణకుమారి పాల్గొని 14 మంది గాయకులకు పురస్కారాలు అందించి సత్కరించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు నాజ్‌సెంటర్‌లోని ఘంటలసాల విగ్రహం వద్ద వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో కళా సంస్థల ప్రతినిధులు మిరియాల ప్రసాదరావు, మేకల పురుషోత్తమ ప్రసాద్, గాయకులు జరీనా, బాబూరావు, సుధీర్ బాబు, రజని, సభ్యులు రాజశేఖర్ పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: స్థానిక కార్మెల్ కొండపై వెలిసిన కార్మెల్ మాతను ఆదివారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఉదయాన్నే వాహనాలు, రైలులో వచ్చిన పలువురు కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్ మాత ముందు కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

యువ వ్యాపార వ్యవస్థాపక సదస్సుకు స్పందన



సదస్సుకు హాజరైన పూర్వ విద్యార్థులు, కేఎల్‌యూ ప్రతినిధులు

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఆదివారం యువ వ్యాపార వ్యవస్థాపకుల సదస్సును ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, రిజిస్టార్ డాక్టర్ కె. సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించిన విద్యార్థులు సొంతంగా వ్యాపారాలను స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పించడం ఆనందంగా ఉందని తెలిపారు. సదస్సుకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరులలో వ్యాపారాలు స్థాపించిన వారు పెద్దసంఖ్యలో రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అమరావతి బోటింగ్ క్లబ్ వ్యవస్థాపకులు, కేఎల్‌యూ పూర్వ విద్యార్థి తరుణ్ మాట్లాడుతూ ఎన్నో కొత్త ఆలోచనలకు, కొత్త సౌకర్యాలకు నాంది కేఎల్‌యూ అని తెలిపారు. నూతన వ్యాపారాలను స్థాపించాలనుకునే వారికి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. శ్రీకావ్య, అసిస్టెంట్ డైరెక్టర్ సోని, సీనియర్ మేనేజర్ కృష్ణారావు, బీబీఏ, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో ముస్లింలకు ప్రాధాన్యమివ్వాలి

మంగళగిరి: ముస్లింలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకులుగా వాడుకుంటున్నాయని మైనార్టీ హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకూఖ్ షబ్లి విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జనాభా ప్రకారం ఎవరు అత్యధిక సీట్లు కేటాయిస్తారో వారికే ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. పట్టణంలోని ఈద్గా షాదీఖానాలలో ఆదివారం ఇస్లామిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. తమ హక్కుల్ని సాధించుకునేందుకు మైనార్టీలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయ పదవులలో అత్యధిక ప్రాధాన్యత, అత్యధికంగా రాజ్యాంగ పదవులు కేటాయించిన పార్టీలకే ముస్లింలంతా ఏకమై మద్దతు తెలియజేయాలని తెలిపారు. ముస్లింలను విమర్శించిన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ మౌలానా హుస్సేన్ మజహరి, ఎండీ. సలీం బాషా, మౌలానా మక్బుల్ అహ్మద్ నబి పాల్గొన్నారు.

ఐశ్వర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

తాడేపల్లి రూరల్ : పెనుమాక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం ఐశ్వర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పెనుమాక అధ్యక్షుడు మేకా దామేష్‌రెడ్డి, మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ బొక్కా ప్రసన్న కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది తలసేమియా వ్యాధితో బాధపడుతూ మృత్యువాత పడుతున్నారని, వారిని ఆదుకునేందుకు ఐశ్వర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఆర్థికసాయం చేశారు. రక్తదానం చేసిన వారికి ఐశ్వర్య ఫౌండేషన్ తరఫున ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీను నాయక్, వందేమాతరం హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ సుభాని, అంజిరెడ్డి, కరీం పాల్గొన్నారు.

వైద్య వృత్తి మహోన్నతం

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య వృత్తి మహోన్నతమైనదని, ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా వైద్యులు భావిస్తారని జీజీహెచ్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.శ్రీకాంత్ తెలిపారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో ఆదివారం భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఉత్తమమైన వైద్యులకు ఉండాల్సిన ముఖ్య లక్షణాలుగా లోకజ్ఞానం, భావవ్యక్తీకరణ నైపుణ్యంతో పాటు, రోగులపై కరుణ కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివి సమాజంలో ఉత్తమమైన వైద్యులుగా సేవలందించాలని తెలిపారు. జీజీహెచ్ న్యూరాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గొట్టిపాటి బిందు నర్మద మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా ఎన్నో వృత్తులు ఉన్నాయని తెలిపారు. వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదని గుర్తించాలని విద్యార్థులకు సూచించారు. చదువు సాగిస్తున్న తరుణంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయని, వాటిని ఏ దృష్టి కోణంలో చూస్తూ పరిష్కరించుకుంటామనేది మన విచక్షణపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశల్ని నిజం చేసి సమాజంలో మంచి వైద్యులుగా రాణించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ వైద్యులుగా అవకాశం వస్తే దాన్నిసద్వినియోగం చేసుకుని ప్రజలకు సేవ చేయాలని సూచించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో ఉత్తమమైన వైద్యులుగా రాణించడానికి భాష్యం మెడెక్స్ ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు.

జీజీహెచ్‌లో అత్యాధునిక క్యాన్సర్ వైద్యసేవలు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో కోట్లాది రూపాయల ఖర్చుతో కార్పొరేట్ వైద్యసేవల్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం జీజీహెచ్ క్యాన్సర్ సెంటర్‌లో డాక్టర్ కిరణ్‌కుమార్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీజీహెచ్ క్యాన్సర్ విభాగంలో రోగులకు అవసరమైన అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీథెరపీ, సీటీ సిమ్యూలేటర్, మామోగ్రామ్, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వైద్య పరికరాలతో పాటు ఎంతో అనుభవం ఉన్న క్యాన్సర్ వైద్యులు ఉన్నారని చెప్పారు. గతంలో చెన్నై, బెంగళూర్, హైదరాబాద్‌లకు రోగులు వెళ్లే వారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గుంటూరు జీజీహెచ్‌లోనే అన్ని వైద్యసేవలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ కోనేటి నందన తేజ , నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.